# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2018** **సమయం : 6.45 గంటలు**

---

**1. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాలకు నీటి భద్రత కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

**2. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే వివిధ వృత్తులపై ఆధారపడి జీవించే వారి జీవితాలలో గణనీయమైన మార్పు వస్తుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి టి.శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.**

**3. ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 29వ తేదీన పదోతరగతి పరీక్ష ఫలితాలు విడుదల చేయనున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు.**

**4. ఈ రోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

**5. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనోభావాలను ఆకాశవాణి ద్వారా ప్రతినెలా దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 43వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాలకు నీటి భద్రత కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం పనులను ముఖ్యమంత్రి సోమవారం పరిశీలించారు. స్పిల్ వే కాంక్రీట్ పనులను, నూతన సమావేశ మందిరాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం రైతుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా, శారదా నదులను అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువును నివారిస్తామన్నారు. 2 లక్షల ఎకరాలలో చేపట్టిన పంట కుంటలు మంచి ఫలితాలిచ్చాయని... గతేడాది తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ భూగర్భ జలాలు 2 మీటర్ల మేర పెరిగాయని వివరించారు. పోలవరం ప్రాజెక్టులో 52 శాతం పనులు పూర్తిచేశామని, అండర్ గ్రౌండ్ పనులు వచ్చే నెలలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కేంద్రం ఇప్పటి వరకూ 5,375 కోట్ల రూపాయలు సాయంచేసినా ఇంకా 2,900 కోట్లివ్వాల్సి ఉందని చెబుతూ ముఖ్యమంత్రి....

వాయిస్ - 39 సెకన్స్

-----------------------------

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే వివిధ వృత్తులపై

ఆధారపడి జీవించే వారి జీవితాలలో గణనీయమైన మార్పు వస్తుందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభిప్రాయపడ్డారు. నిన్న మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రాయితీ గొర్రెలకు సంబంధించి ఉచితంగా దాణా, గడ్డి విత్తనాలు సరఫరా చేయడంతో పాటు మృతి చెందిన గొర్రెల స్థానంలో వేరే గొర్రెలను ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో కోటి ఎకరాల భూమికి సాగునీరివ్వాలనే సంకల్పంతో లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతోనే కాళేశ్వరంకు తమ ప్రభుత్వం రూపకల్పన చేసిందని శ్రీనివాస యాదవ్ పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సైబర్ భద్రతలో ఎదురౌతున్న క్రొత్త సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొవడంలో విద్యార్ధులు తగిన చొరవ చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

సోమవారం ఉండల్లిలోని గ్రీవిఎన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎపీసిఎస్ఒసి) ను లాంఛనంగా ప్రారంభించి, ఎస్ఓసి డ్రాఫ్ట్ డాక్యూమెంట్‌ను, ఎస్ఓసి పోర్టల్‌ను, ముసాయిదా ప్రతిని ముఖ్యమంత్రి అవిష్కరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ప్రస్తుతం 4వ పారిశ్రామిక విప్లవం ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌కు ప్రాధాన్యత సంతరించుకుందని ప్రభుత్వం నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌ను ఎథికల్ హ్యాకింగ్ చేసి లోపాలు సరిచేయడానికి సహకరిస్తే అటువంటి విద్యార్ధులకు ప్రోత్సాహకాలు అందిస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 29వ తేదీన పదోతరగతి పరీక్ష ఫలితాలు విడుదల చేయనున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం మంత్రి విద్యాశాఖకు సంబంధించి అనేక అంశాలపై సంబంధిత అధికారులతో అమరావతిలో సమీక్షించారు. మరింత మంది డిఎస్సీకి అర్హత సాధించేదిశగా మరో టెట్‌ను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమంలో మే 4న నోటిఫికేషన్ విడుదల చేయాలని, జూన్ 10 నుంచి టెట్ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో లాగానే ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షను నిర్వహించనున్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటున్న షెడ్యూల్ కులాలు... షెడ్యూల్ తెగలు, ఓబీసీ విద్యార్థులకు నెలనెలా 15 కిలోల బియ్యం, గోధుమలు రాయితీ ధరపై అందించనున్నట్లు కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ వెల్లడించారు. గోధుమలు కిలో రూ. 4.15, బియ్యం రూ. 5.65 చొప్పున అందజేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

---------------------------

ఈ రోజు జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పంచాయితీలకు సాధికారత కల్పించే లక్ష్యంతో మనదేశంలో ప్రతీ ఏటా ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించి క్షేత్రస్థాయిలో అభివృద్ధి సాధించే దిశగా జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

ఇలావుండగా... కేంద్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభించిన గ్రామ్ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా ఈ రోజు పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు మధ్యప్రదేశ్‌లోని మాండ్లా జిల్లాలో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్‌ను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న పంచాయితీ రాజ్ ప్రతినిధులనుద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు.

కాగా... ఈ సందర్భంగా ఉత్తమమైన సేవలందించిన గ్రామ పంచాయితీలకు కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వశాఖ ఈ రోజు ఢిల్లీలో పురస్కారాలను ప్రదానం చేస్తుంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ రోజు పంచాయితీ రాజ్ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు.

-------------------------

ప్రధాన మంత్రి నరెంద్ర మోదీ దేశ ప్రజలతో తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా పంచుకునే “మన్ కీ బాత్”- మనసులోని మాట కార్యక్రమం వచ్చే ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా చివరి ఆదివారం ప్రసారం అవుతున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి-వర్తమాన సామాజిక అంశాలకు సంబంధించి తన అభిప్రాయాలను ప్రజలకు తెలుపుతున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రస్తావించాల్సిన అంశాలకు సంబంధించి సూచనలు సలహాలు కూడా ప్రజలు పంచుకోవచ్చు.

-------------------------

రైతులకు ముందస్తు పెట్టుబడిగా ఎకరాకు 4,000 రూపాయలు ఇవ్వడం ప్రపంచంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వచ్చేనెల 10వ తారీఖున రాష్ట్ర వ్యాప్తంగా రైతుబంధు పథకంలో భాగంగా చెక్కుల పంపిణీ ప్రారంభం కానుందని తెలిపారు. రైతుబంధు పథకంలో చెక్కుల పంపిణీ, రెండు పడక గదుల నిర్మాణంలో ప్రగతి, మిషన్ భగీరథ పనుల పురోగతిపై కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల సమీక్ష సమావేశం మంత్రి నిర్వహించారు.

-------------------------

సురక్షితమైన ప్రయాణం ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు నిచ్చారు. ఏప్రిల్ 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించే 29వ భద్రతా వారోత్సవాలను మంత్రి శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో నిన్న ప్రారంభించారు. రవాణా శాఖ రూపొందించిన వారోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను, ఫ్లెక్సీలను విడుదల చేసారు.

-------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతోంది. ఈ రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందని ప్రజలు బయటకు వచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

====================